# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 12-05-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం నిన్న సాయంకాలంతో ముగిసింది.**

2. **పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి 14వ తేదీన ప్రత్యేక క్యాజువల్ లీవ్ ఆన్ డ్యూటీ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు.**

3. **పోలింగ్ రోజున అన్ని కంపెనీలు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ తెలిపారు.**

4. **సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు.**

5. **సమాజంలో నర్సులు అందజేస్తున్న సేవలనుస్మరించు కుంటూ ఈరోజు అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం నిన్న సాయంత్రంతో ముగిసింది. సార్వత్రిక ఎన్నికల నాలుగో దశలో భాగంగా తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు, ఆంధ్రప్రదేశ్‌లో 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ స్థానాలకు రేపు పోలింగ్ జరగనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని అత్యంత సమస్యాత్మక ప్రాంతాలైన అరకు, పాడేరు, రంపచోడవరంలో సాయంత్రం 4 గంటలకు, సమస్యాత్మక నియోజకవర్గాలైన పాలకొండ, కురుపాం, సాలూరులో 5 గంటలకు ప్రచారం నిలిపివేశారు. రాష్ట్రంలోని మిగతా 169 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగిసింది. తెలంగాణలో ఓటింగ్‌కు నిర్దేశించిన సమయం ప్రకారమే శనివారం సాయంకాలం ప్రచారానికి గడువు ముగిసింది. 106 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో సోమవారం సాయంత్రం 6 గంటల వరకు, 13 సమస్యాత్మక సెగ్మెంట్లలో సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

--------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రేపు పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి 14వ తేదీ మంగళవారం ప్రత్యేక క్యాజువల్ లీవ్ ఆన్ డ్యూటీ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్

కుమార్ మీనా తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఆ మరుసటి రోజు ప్రత్యేక క్యాజువల్ లీవ్ ఆన్ డ్యూటీగా పరిగణించాలని ఏపీ ఎన్జీవో, ఏపీ జేఏసీ ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. పోలింగ్ విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందికి ఈ ప్రత్యేక క్యాజువల్ లీవ్ వర్తిస్తుందని తెలిపారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రేపు పోలింగ్ రోజున అన్ని కంపెనీలు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని, నిబంధనలు పాటించని సంస్థలపై చర్యలు ఉటాయని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ తెలిపారు. పోలింగ్ సమయం దగ్గర పడినందున నిఘా మరింత పెరుగుతుందన్నారు. జూన్ 1వ తేదీన సాయంత్రం 6 గంటల 30 నిమిషాల వరకు ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం ఉందన్నారు. బందోబస్తు కోసం రాష్ట్రానికి కేంద్ర బలగాలు వచ్చాయని, 60 వేల మంది రాష్ట్ర పోలీసులు విధుల్లో ఉంటారని చెప్పారు. రాష్ట్రంలో ఒక లక్ష 88 వేల మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారని వికాస్‌రాజ్ తెలిపారు.

---------------------------

సమాజంలో వైద్య సేవలకు ప్రతి రూపంగా నిలుస్తున్న...., నర్సులు అందజేస్తున్న సేవలనుస్మరించు కుంటూ ఈ రోజు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. వైద్య సేవలకు తన జీవితాన్నే అంకితంచేసిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా నిర్వహించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమం జరుగుతోంది. 1820 వ సంవత్సరం మే 12వ తేదీన ఇటలీలో జన్మించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ ..... 1854 సంవత్సరంలో సంభవించిన క్రిమియన్ యుద్ధంలో గాయపడిన సైనికులకు తన శక్తి మేరకు వైద్య సేవలు అందించారు. రాత్రి సమయంలో కూడా గాయపడిన సైనికులకు దీపం సహాయంతో వైద్య సేవలు అందించారు. అందుకే .... ఆమెకు "లేడీ విత్ ల్యాంప్" అని పేరు వచ్చింది. ముఖ్యంగా కరోనా వైరస్ సమయంలో మన దేశంలో నర్సులు అందించిన సేవలు వెలకట్టలేనివి. తమ ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా భావించి .... అటు కుటుంబ పరంగా...., ఇటు వృత్తి పరంగా ఎన్నో ఒత్తిడులను ఎదుర్కొంటూ వైరస్ సోకిన రోగులకు దగ్గరుండి మరీ సేవలు అందించారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు రోజూ నడిచే 339 సర్వీసులతో పాటు నిన్న 302, ఈరోజు 206 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. శనివారం హైదరాబాద్ నుంచి ఒంగోలుకు 38, ఏలూరు 20, మచిలీపట్నం 23, విజయవాడ 45, గుంటూరు 18, నరసరావుపేట 26, నెల్లూరు 17, నంద్యాల 19, విశాఖపట్నానికి 4 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు వివరించారు. బెంగుళూరు నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నిన్న 323, ఈరోజు 269 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ ఛార్జీలే వసూలు చేస్తామని తెలిపారు. పోలింగ్ తర్వాత తిరుగు ప్రయాణమయ్యే వారి కోసం కూడా ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నిల పోలింగ్ నిర్వహణకు ఎన్నికల సంఘం ముమ్మర ఏర్పాట్లు చేసింది. 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు రేపు పోలింగ్ నిర్వహించనుంది. ఈ ఎన్నికల్లో 4 కోట్ల 14 లక్షల

మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. 169 నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎన్నికలు జరగనున్నాయి. అరకు, పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటల వరకు, పాలకొండ, కురుపాం, సాలూరులో సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

----------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 12 వేల 459 సున్నితమైన పోలింగ్ కేంద్రాలు గుర్తించినట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది. మాచర్ల సహా 14 నియోజకవర్గాల్లో వందశాతం వెబ్ కాస్టింగ్ నిర్వహించనున్నారు. అనంతపురం, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో వందశాతం వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేశారు. లోక్‌సభ స్థానాలకు 454 మంది అభ్యర్థులు, 175 అసెంబ్లీ స్థానాలకు 2 వేల 387 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. విశాఖ లోక్‌సభలో అత్యధికంగా 33 మంది, నంద్యాలలో 31 మంది, గుంటూరులో 30 మంది పోటీలో ఉన్నారు. అత్యల్పంగా రాజమహేంద్రవరంలో 12 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. శాసనసభ నియోజకవర్గాల్లో అత్యధికంగా తిరుపతి అసెంబ్లీకి 46 మంది, మంగళగిరిలో 40 మంది పోటీలో ఉన్నారు. అత్యల్పంగా చోడవరం అసెంబ్లీకి ఆరుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

----------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో 2 కోట్ల 3 లక్షల 39 వేల 891 మంది పురుషులు, 2 కోట్ల 10 లక్షల 58 వేల 615 మంది మహిళా ఓటర్లు ఉన్నట్టు ఎన్నికల సంఘం తెలిపింది. థర్డ్ జెండర్ ఓటర్లు 3 వేల 421 మంది, సర్వీసు ఓటర్లు 68 వేల 185 మంది ఉన్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 46 వేల 389 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేసింది. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. లక్ష 60 వేల ఈవీఎంలను ఎన్నికల సంఘం అందుబాటులో ఉంచింది. 3 లక్షల 30 వేల మంది పోలింగ్ విధులు నిర్వహించనున్నారు. 1 లక్ష 14 వేల మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. వీరికి అదనంగా మరో 10వేల మంది సెక్టార్ అధికారులు పనిచేస్తారు. 8 వేల 961 మంది మైక్రో అబ్జర్వర్లు, 46 వేల 165 మంది బీఎల్‌వోలు విధుల్లో ఉంటారని ఎన్నికల సంఘం తెలిపింది. మొత్తంగా 5 లక్షల 26 వేల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉంటారు.

----------------------------

ఎన్నికలను సజావుగా.. అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసినట్లు తెలంగాణ డీజీపీ రవిగుప్తా తెలిపారు. పౌరులంతా బాధ్యతతో ఓటు హక్కును వినియోగించుకోవాలని నిన్న ఆయన ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల బందోబస్తు నిమిత్తం 73 వేల 414 సివిల్ పోలీసులు, 500 సెక్షన్ల టీఎస్ఎస్‌పీ సిబ్బంది, 164 కంపెనీల కేంద్ర బలగాలు, 3 కంపెనీల తమిళనాడు పోలీసులు, 2088 మంది ఇతర శాఖల సిబ్బందితోపాటు సుమారు 7 వేల మంది హోంగార్డులు విధుల్లో ఉన్నట్లు చెప్పారు.

----------------------------

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా తెలంగాణలో 48 గంటల పాటు మద్యం అమ్మకాలను నిలిపివేశారు. రేపు సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసి ఉంటాయని అబ్కారీ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. బార్‌లు, క్లబ్బులు, కల్లు దుకాణాలు, మద్యం డిపోలు మూసివేసినట్టు స్పష్టం చేసింది.

======================